క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు పరిశీలన

సారంగపూర్: మండలంలోని జామ్, యాకర్ పెల్లి గ్రామాల్లో కౌట్ల(బి) పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని నిర్వాహకులు సలీమ్, రవిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం త్వరగా మిల్లులకు తరలించాలని సూచించారు. ఇప్పటివరకు తరలించిన ధాన్యం వివరాలను గురించి ఆరా తీశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రీ చేసి వారికి తూకం పట్టి అందజేయాలని సూచించారు. అలా చేస్తేనే రైతుల ఖాతాల్లో డబ్బులు వెంటనే జమ అవుతాయని తెలిపారు. ఏమాత్రం అలసత్వం వహించకుండా త్వరగా కొనుగోళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు, తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఏవో రవి

ఖానాపూర్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో ఆసం రవి హెచ్చరించారు. మండలంలోని సత్తన్‌పల్లి గ్రామంలోని రైతు వేదికలో ఖానాపూర్, పెంబి మండలాలకు చెందిన ఫర్టిలైజర్లు, డీలర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలను వివరించారు. ప్రతీ డీలర్ వారి దుకాణాల్లో ధరల పట్టికతోపాటు స్టాక్ నిల్వబోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఏఈవో రాకేశ్, తదితరులు ఉన్నారు.

ఆహ్వానపత్రిక అందజేత



రాజ్యసభ సభ్యుడు నిరంజన్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిర్మల్‌టౌన్: దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలోని ఈనెల 22 నుంచి 31 వరకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవ, కల్యాణ వేడుకలు నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు నిరంజన్ రెడ్డి హాజరుకావాలని జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఈశ్వర్‌కు ఆహ్వాన పత్రికను అందించారు. ఆలయ చైర్మన్ మహేశ్, ఏలేటి ప్రీతంరెడ్డి, పూదరి శివ కుమార్, గుమ్ముల నర్సయ్య, దమ్మ మహేశ్ తదితరులు ఉన్నారు.

ఇనాం భూముల వేలం

తానూరు: తహసీల్దార్ కార్యాలయంలో మండల కేంద్రంలో ఇనాం భూములకు తహసీల్దార్ లింగమూర్తి ఆధ్వర్యంలో సోమవారం వేలం పాట నిర్వహించారు. తానూరు శివారులో 37 సర్వే నంబర్ గల 19.6 ఎకరాలకు రూ.2.26 లక్షలు వేలం పాడి ఆయూబ్‌ఖాన్ దక్కించుకున్నారు. సర్వే నంబర్ 67లో 92.17 ఎకరాలకు రూ.35 వేలకు అబ్దుల్ కరీం, సర్వే నంబర్ 191లో 54.12 ఎకరాలకు రూ.3.5 లక్షలకు శనావత్‌ఖాన్ వేలం ద్వారా దక్కించుకున్నారు. ఈ వేలం ద్వారా మొత్తం 165.35 ఎకరాలకు ఏడాదికి రూ.5.66 లక్షల ఆదాయం సమకూరిందని తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ మోహన్‌సింగ్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

నర్సాపూర్(జి): తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల కేంద్రంలోని 12వ వార్డు కాలనీ మహిళలు పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. తమ వార్డులో మిషన్ భగీరథ నీరు రాక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అధికారులు వెంటనే పట్టించుకుని చర్యలు చేపట్టాలని కోరారు.

నర్సరీ పరిశీలన

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామ నర్సరీని ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఏపుగా పెరగడం చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. మిషన్ భగీరథ పైప్ లీకేజీ మరమ్మతు, గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. కార్యదర్శి నవనీత్ కుమార్ ఉన్నారు.

చెరువు మరమ్మతు ఎప్పుడో..

- కట్ట తెగే వరకు స్పందించరా?
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు

లోకేశ్వరం: మండలంలోని రాజూరా గోవింద్ చెరువు కట్ట కోతకు గురైంది. వర్షాకాలంలో భారీవర్షాలు కురిస్తే కట్ట తెగిపోయే ప్రమాదం ఉంది. చెరువు కట్ట కింద పొలాలకు నీరందించే పంట కాలువలు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. చెరువుల కింద సిమెంట్ కాల్వలు నిర్మించాలని దశాబ్దాల కాలంగా అధికారులకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. బోర్లపై ఆధారపడుతూ వరి, కంది, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. వానలు పడితే చెరువులు, వాగులు నిండుతున్నాయి. గోవింద్ చెరువుకు సంబంధించిన కాల్వలకు మరమ్మతు చేయకపోవడంతో పంటలకు నీరందడం లేదు.

నిర్లక్ష్యం నీడలో చెరువు, కుంటలు

వర్షాకాలంలో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువు పునరుద్ధరణ చేపట్టింది. ఇది సత్ఫాలితాలు ఇచ్చింది. ఆ తర్వాత వాటిని పట్టించుకోకపోవడంతో చెరువులు యథాస్థితికి వచ్చాయి. పునరుద్ధరణ చేపట్టిన పూడికతీత పనులు నీటి సామర్థ్యాన్ని పెంచాయి. ప్రస్తుతం నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో నిర్లక్ష్యపు నీడలో మగ్గిపోతున్నాయి. గట్టిగా వానాలు కురిస్తే చెరువు, కుంటలకు గండిపడే ప్రమాదం కూడా లేకపోలేదు.

పంట కాలువలు నిర్మాణమెప్పుడో..



వర్షాలకు కోతకు గురైన రాజూర గోవింద్ చెరువు

జిల్లాలో చెరువులు, కుంటలు 659 ఉన్నాయి. ఈ చెరువుల కింద 65,258 ఎకరాలు ఆయకట్టు భూమి ఉంది. చెరువుల నుంచి పంటలకు నీళ్ల పారాలంటే తప్పనిసరిగా సిమెంట్ పంట కాల్వలు నిర్మించి ఉండాలి. చాలా చెరువుల కింద పంట కాల్వల నిర్మాణాలు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. గోవింద్ చెరువు విస్తీర్ణం 550 ఎకరాల్లో చెరువు నుంచి 350 ఎకరాలకు సాగు నీరందిస్తాల్సి ఉండగా 250 ఎకరాలకు సాగు నీరందించగా 100 ఎకరాలకు సాగు నీరందడం లేదు. ఉన్న వాటిలో మట్టికాల్వలు చెట్లు, మట్టితో మూసుకుపోగా..నీళ్ల పంటలకు పారడం లేదు. పక్కనే పుష్కలంగా నీళ్లున్నా పంటలకు పారబెట్టుకోలేని దుస్థితి నెలకొంది. మట్టి కాలువల్లో నిండిన మట్టిని పూడికతీత, పిచ్చిమొక్కలు తొలగించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ముళ్లపొదలు తీసేవారేరి..

మిషన్ కాకతీయ పథకంలో ద్వారా చెరువుల నిర్వహణపై దృష్టిసారించే వారే లేకుండా పోయారు. చాలావరకు చెరువు కట్టపై ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. చెరువు లోపల మొక్కలు పెరగడంతో కొన్ని చెరువుల్లోకి దిగే పరిస్థితి లేకుండా పోయింది. ఉపాధి హామీ పథకంలో చెరువు కట్టపై పెరిగిన కంప చెట్లు తొలగించాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

సిమెంట్ కాల్వలు నిర్మించాలి



చెరువు నీటిపైనే రాజూర, గడ్‌చాంద గ్రామాల రైతులు ఆయకట్టు కింద పంటలు సాగు చేస్తున్నారు. చెరువులో నీళ్లున్నా కాల్వలు మూసుకుపోవడంతో చాలా మంది రైతుల పంటలకు నీళ్ల పారడం లేదు. ప్రభుత్వం స్పందించి సిమెంట్ పంట కాల్వలు నిర్మించాలి.

– ఒడ్నం రాజు, గడ్‌చాంద

మరమ్మతు చేయండి



గోవింద్ చెరువుకట్ట కోతకు గురైంది. ఏడాదిలో భారీ వర్షాలు కురిస్తే కట్ట తెగే ప్రమాదం ఉంది. జూన్ లోగా మరమ్మతు కోసం నిధులు మంజూరు చేసి చెరువు, పంట కాలువలకు మరమ్మతు చేపట్టాలి.

– నల్ల రమేశ్, రాజూర

ప్రతిపాదనలు పంపిస్తాం

చెరువులు, కుంటలు భారీ వర్షాలకు కోతకు గురైన మాట వాస్తవమే. ఎక్కడెక్కడ నిర్మించాలనేది ప్రభుత్వానికి త్వరలో ప్రతిపాదనలు పంపిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే కోతకు గురైన చెరువు,కుంటలకు మరమ్మతు చేపడుతాం.

– అనిల్, ఇరిగేషన్ డీఈ, భైంసా



అ'పూర్వ' సమ్మేళనం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ఏ.ఎన్.రెడ్డి జూనియర్ కళాశాలకు చెందిన 1996-98 ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. వీరి అపూర్వ సమ్మేళనానికి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ వేదికైంది. ఆత్మీయ పలుకరింపులు, ఆలింగనం అనంతరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాతికేళ్ల కిందటి జ్ఞాపకాలను ఒక్కొక్కటి నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. సిల్వర్ జూబ్లీ వేడుకను అంతా కలిసి జరుపుకొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శంకర్, ప్రకాశ్, చిన్నయ్య, రామచంద్ర, నాగేశ్వర్‌రావు తదితరులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు సతీశ్, వేణుగోపాల్, సత్యనారాయణ, ప్రవీణ్, రాంబాబు, రవీందర్, మాలతి, ప్రతిభ పాల్గొన్నారు.

ఎల్లమ్మ బోనాలు

ముధోల్: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎల్లమ్మ బోనాలను నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని సమర్పించారు. శోభాయాత్రలో శివసత్తుల, పోతురాజుల విన్యాసాలు అలరించాయి. ప్రత్యేకంగా కరీంనగర్, సిరిసిల్ల, వరంగల్, హైదరాబాద్ నుంచి శివసత్తులు ఈ బోనాల్లో పాల్గొని విన్యాసాలను ప్రదర్శించారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

అమ్మవారి ఏడంతస్తుల బోనాలను నెత్తిన ఎత్తుకొని ప్రత్యేక విన్యాసాలను ప్రదర్శించారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మహేశ్ ఇటీవల రోడ్డుప్రమాదానికి గురయ్యాడు. దీంతో కాలికి గాయమై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ సోమవారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు. అనంతరం అడవిసారంగపూర్‌కు చెందిన మాజీ ఉప సర్పంచ్ మారుతి తండ్రి సోనేరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా,



యువకుడిని పరామర్శిస్తున్న జాన్సన్‌నాయక్

బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచి సుర్జాపూర్‌కు వెళ్లి మృతి చెందిన భూసి నడిపినర్సయ్య కుటుంబాన్ని ఓదార్చారు.

కల్యాణానికి వేళాయె



కుంటాల: మండలంలోని అందాకూర్ శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పక్కనే ఉన్న పోలేరమ్మ తల్లిని భక్తులు ప్రత్యేకంగా కొలుస్తారు. ముత్తైదువులు ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ పూజలు నిర్వహిస్తారు. ఆలయంలో కోరిన కోర్కెలు నెరవేరడంతో భక్తులు శీతాకాలంలో వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్రగా వచ్చి మొక్కు చెల్లించుకుంటారు. లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈనెల 23న వైభవంగా నిర్వహించనున్నారు. నున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పరిశీలన

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ పరిసర అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో 22 నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. నిర్మల్ సీఐ శ్రీనివాస్, దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి సోమవారం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తులకు ఏర్పాట్లు, తదితర అంశాలపై ఆలయ చైర్మన్ మహేశ్, మాజీ సర్పంచ్ ఇప్ప నర్సారెడ్డి, ఎండోమెంట్ సీనియర్ అసిస్టెంట్ జాదవ్ మాధవరావుతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి ముగిసే వరకు జరిగే కార్యక్రమాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు వారు వివరించారు. ఆలయ కోనేటి వద్ద సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు నిర్మల్ సీఐ తెలిపారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న నిర్మల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై సుమాంజలి

పరిసరాల శుభ్రత పాటించాలి

నిర్మల్‌టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రియదర్శినినగర్‌కాలనీలోని ఎస్.ఆర్ జూనియర్ కళాశాల ప్రాంతంలో డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని కాలనీ వాసులు సోమవారం చైర్మన్‌కు విన్నవించారు. స్పందించిన ఆయన కాలనీలో పర్యటించి పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. త్వరలోనే కాలనీలో పలు అభివృద్ధి పనులు చేపడుతామన్నారు.



డ్రెయినేజీలు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

పెద్దమ్మతల్లి ఉత్సవాలు

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయ నాల్గవ వార్షిక ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు పట్టువేసి పూజా కార్యక్రమాలు చేపట్టారు. డప్పుచప్పుళ్ల మధ్య గ్రామంలో నుంచి ఊరేగింపుగా వెళ్లి ఉత్సవాలు నిర్వహించారు. ముదిరాజ్ సంఘ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



వేసవిలో పాడి గేదెల సంరక్షణ

- పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలు

లోకేశ్వరం: ప్రతిఏటా పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు పశువుల్లో పాల పునరుత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. ఆవులతో పోల్చితే గేదెలు ఎక్కువగా ఎండవేడికి గురవుతుంటాయి. ఎందుకంటే గేదెల్లో స్వేదగ్రంధులు తక్కువగా ఉంటాయి. నల్లని చర్మ ఉండటం వల్ల శరీరం నుంచి ఉష్ణం బయటకు వెళ్లక అధిక బాహ్య వేడిని తట్టుకోలేవు. అధిక వేడిమిని నుంచి పాడి గేదెల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మండల పశువైద్యాధికారి జెస్సీ వివరించారు.

నీటివసతి ఏర్పాటు చేయాలి

ఆరోగ్యంగా ఉన్న పశువు రోజుకు 75 నుంచి 80 లీటర్ల నీటిని తాగుతుంది. పాలలో 85 శాతం నీరు ఉంటుంది. లీటరు పాలు ఉత్పత్తి కావడానికి 2.5 లీటర్ల నీరు అవసరమవుతుంది. పాడి పశువుల్లో వేసవి కాలంలో శుభ్రమైన చల్లని నీరు కావల్సిన మోతాదులో ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. నీరు సక్రమంగా అందుబాటులో ఉంటే డీహైడ్రేషన్‌కు గురికాకుండా పాల దిగుబడి తగ్గకుండా జాగ్రత్త పడవచ్చు. ఎండాకాలంలో పశువులు తక్కువ మేత తీసుకుంటాయి. అధిక శక్తి కలిగిన దాణాను అందించాలి. పచ్చి మేత దాణాలను పగటిపూట ఎండు మేతను రాత్రి పూట అందించాలి.

గృహసౌర్యం కల్పించాలి

గేదెలను కొట్టాలకు తూర్పు, పడమరలో ఉంచి ఎండ వేడిమి నుంచి రక్షణ పొందవచ్చును. కొట్టం నీడనిచ్చే సుబాబుల్, ఆవిసె, వేపచెట్లను పెంచాలి. పైకప్పు రెండు వైపులా తాటాకులు లేదాగడ్డితో కప్పి మధ్యలో నీటిని చల్లాలి. రోజుకు పశువును రెండు లేదా మూడు సార్లు చల్లని నీటిలో కడగాలి. కొట్టాలో స్ప్రింకర్లు వాడటం ద్వారా 10 శాతం అధిక పాల దిగుబడి పొందవచ్చు.

మేతలో సమయపాలన

ఎండ తీవ్రంగా సమయాల్లో గేదెలను మేత కోసం బయటకు పంపవద్దు. ఎండవేడి ఉన్నప్పుడు పశువులను కొట్టాలలో ఉంచి, పచ్చిగడ్డిని అందించాలి. దీంతో మంచి పాల దిగుబడిని పొందవచ్చును. దాణా మినరల్ మిక్చర్‌ను తప్పకుండా ఇవ్వాలి. ఒకవేళ సైలాజి(పాత గడ్డి) అందుబాటులో ఉంటే దానిని ఇవ్వడం చాలా శ్రేయస్కారం.

ఈ జాగ్రతలు అవసరం

పాడి పశువు వడదెబ్బ గురైతే వాటి శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమట ఎక్కువగా బయటికి రావడం, మేత తీసుకోకపోడం, శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ఈ లక్షణాలు ఉన్న గేదెలను గుర్తించి చికిత్స చేయించాలి. పశువును చల్లటి ప్రదేశంలో గాని, నీడలో గాని ఉంచాలి.



రాయపూర్‌కాండ్లీలో గేదెలను నీటితో శుభ్రం చేస్తున్న రైతు

వైద్యుల సూచనలు పాటించాలి

వైద్యుల సలహాలు, పద్ధతులను అవలంబిస్తే విలువైన పశువులు అనారోగ్యానికి గురికాకుండా పాల దిగుబడి తగ్గకుండా కాపాడవచ్చును. తద్వార రైతుల వేసవిలో పాల ఉత్పత్తి ద్వారా అధిక లాభాలు పొందవచ్చును.

– జెస్సీ, పశువైద్యురాలు, లోకేశ్వరం

నేడు విద్యుత్ అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌టౌన్ ఫీడర్ 11 కేవీ పరిధిలో మరమ్మతు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ రవి ఓ ప్రకటనలో తెలిపారు. కలానగర్, జోహరనగర్, బాగులవాడ, పాన్‌గల్లీ, చిక్కడపల్లి కస్బా, నిషన్, మయూరి హోటల్ వెనక ప్రాంతంలో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

కుంటాల: కుంటాల 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ, కుంటాల సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

దుస్తుల పంపిణీకి ఏర్పాట్లు

కుంటాల: ప్రభుత్వ పాఠశాలలో సమదుస్తుల పంపిణీ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. కుంటాల ఐకేపీ కార్యాలయానికి చేరుకున్న సోమవారం మెటీరియల్‌ను పరిశీలించారు. మండలంలోని 21 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 5 ఉన్నత, ఆదర్శ, కేజీవీబీ పాఠశాలలున్నాయి. ఇందులో 1,069 విద్యార్థులు, 1,978 బాలికలు ఉన్నారు. ఒక్కొక్కరికి రెండు జతల సమ దుస్తులను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కల్లూర్, కుంటాల, లింబా(కే) గ్రామాల్లో క్లస్టర్లు ఏర్పాటు చేసి స్వయం సహాయక సంఘాల మహిళలతో కుట్టించి పాఠశాలలకు అందజేస్తామన్నారు. సీసీలు పెంటన్న, కవిత, యూసుఫ్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో పూజలు

తానూరు: మండలంలోని కోలూరు శివారు ప్రాంతంలో ఉన్న శివాలయంలో రైతు బాగ్డే కామన్ గంగారాం సోమవారం పూజలు నిర్వహించారు. అనతంరం అన్నదానం చేపట్టారు. ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నాడు. ఏటా మహాదేవున్ని ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందని రైతు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కిక్ బాక్సింగ్ కిట్ అందజేత



కిట్ అందజేస్తున్న సభ్యులు

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన కె.నాగలక్ష్మి జాతీయ క్రీడాకారిణికి పట్టణానికి చెందిన వొడ్డెపల్లి కృష్ణంరాజు సోమవారం కిక్ బాక్సింగ్ కిట్ అందజేశారు. ఈనెల 21న మహారాష్ట్రలోని పుణెలో ప్రారంభమయ్యే జాతీయ పోటీల్లో పాల్గొనే యువతికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో కృష్ణంరాజు రూ.12 వేల విలువైన బాక్సింగ్ కిట్‌ను అందజేశారు. ఓకేఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.